

ఆక్సిలెంట్ ఫార్మా పరిశ్రమకు ప్రతిష్టాత్మక సర్టిఫికెట్

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ప్రతిష్టాత్మక 'హెల్త్ కెనడా కరెంట్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' సర్టిఫికెట్ దక్కింది. కంపెనీ నాన్-స్టెరైల్ సదుపాయం కోసం ఈ గుర్తింపు అందుకుంది. సర్టిఫికెట్ అందించే సంస్థ ఈ ఏడాది సెప్టెంబర్ 16-20 తేదీల మధ్య పరిశ్రమను సందర్శించి నాణ్యత తనిఖీలు నిర్వహించింది. ఈ సర్టిఫికెట్ పొందడం తమకెంతో సంతోషంగా ఉందంటూ ఆక్సిలెంట్ ఫార్మా కంపెనీ ఛైర్మన్ జితేష్ దేవేంద్ర పేర్కొన్నారు.

పేదల పక్షపాతి 'శంకరన్'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సీనియర్ ఐఎఎస్ అధికారి ఎస్ ఆర్ శంకరన్ పేదల పక్షపాతిగా నిలిచారని వక్తలు ఉద్ఘాటించారు. వెట్టి చాకిరీ విముక్తి ప్రదాత, దళిత ఆదివాసి ,బడుగు వర్గాల పక్షపాతి. వందలాదిమంది ఐఏఎస్ అధికారులకు స్ఫూర్తిగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్సార్ శంకరన్ 90వ జయంతిని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ భవన్లో ఆ సంఘం అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ఎస్సార్ శంకరం సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిగా ఉన్న ఎస్ ఆర్ శంకరన్ నిత్యం నిరాడంబరంగానే ఉన్నారని తెలిపారు. ఆర్భాటాలు ప్రచారాలకు ఆయన దూరమని, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను, కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ప్రకటించినా వాటిని ఆయన తిరస్కరించారని గుర్తు చేశారు. బొగ్గు గనులను జాతీయం చేయడంలో ఆయన పాత్ర కీలకమని, ఎస్సీ ఎస్టీ హాస్టళ్ల ఏర్పాటు, సాంఘిక సంక్షేమ స్కూల్స్ నెలకొల్పడానికి ఆయన ఎంతో కషి చేశారని అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో ఆయనకి అనుబంధం ఉందన్నారు. జిల్లాకు చెందిన భూ పోరాట యోధుడు నరేంద్ర నాథ్ ను ఆయన అప్పుడప్పుడు కలిసి పోరాటాల్లో పాల్గొనేవారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న పి.అంజయ్య

హయాంలో ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగం ప్రకారం అందాల్సిన సౌకర్యాలను హక్కులను వినియోగించుకునేలా ఆయన తీసుకున్న నిర్ణయాలు, నేటికీ ఆదర్శప్రాయం అన్నారు. తాను వివాహం చేసుకోకుండా, ఐఏఎస్ అధికారిగా తనుకు వచ్చే జీతం లోని కొంత మొత్తాన్ని తన అవసరాలు కోసం ఉంచుకొని, అధిక మొత్తం పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అభివద్ధి కోసం వెచ్చించే వారని కొనియాడారు. భారతదేశంలోనే ఐఏఎస్ అధికారిగా ఎస్సార్ శంకరన్ జీవితం ఆదర్శవంతం అన్నారు. పేద ప్రజల సంక్షేమం, సమాజ అభ్యున్నత కోసమే సాధారణ జీవితాన్ని గడిపిన మానవతా మూర్తి ,పేదల పక్షపాతి ముఖ్యంగా వెట్టి చాకిరి నిర్మూలన కోసం, ఎస్సీ ,ఎస్టీల ఆర్థిక అభివద్ధి కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రత్యేక నిధులు సమకూర్చడానికి ప్రత్యేక చట్టాలను రూపొందించిన మహోన్నత మేధావి అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జాయింట్ కలెక్టర్ గా, కలెక్టర్ గా, ప్రత్యేక కార్యదర్శిగా పనిచేసిన కాలంలో పేద బడుగు వర్గాలకు వేలాది ఎకరాలు పంచిన ఘనత ఎస్సార్ శంకరన్న కే దక్కుతుందని గుర్తు చేశారు. అట్లాంటి ఐఏఎస్ శంకరన్ పేరుతో తిరుపతి నగరంలో ఓ కాలనీని జర్నలిస్టులకు ఏర్పాటు చేయడం అభినందనీయం. అంతేకాకుండా తొందరలో తిరుపతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. యువ ఐఏఎస్ అధికారులకు ఆయన ఆదర్శప్రాయుడన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి గుర్రప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య, అంబేద్కర్ భవన్ కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ పరమశివం, పుష్పరాజ్, భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షులు ధన శేఖర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చిన్నం కాలయ్య, బీసీ సంఘర్షణ సమితి నాయకులు సాకం ప్రభాకర్, అక్కినపల్లి లక్ష్మయ్య, బీసీ కేశవులు పాల్గొన్నారు.



ఈవో శ్యామలరావుకు వినతిపత్రం ఇస్తున్న కందారపు మురళి

శ్రీవారి మెట్టు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

టీటీడీ ఈఓకు సీఐటీయు వినతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

గత 15 సంవత్సరాలుగా శ్రీవారి మెట్టు మార్గంలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న పేదలకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి టిటిడి ఇఓ శ్యామలరావు కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు, సిఐటియు నేతలు సంయుక్తంగా టీటీడీ ఇఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. గత 62 రోజులుగా టీటీడీ పరిపాలన భవనం ఎదుట తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన దీక్షలు చేస్తున్నారని, తీవ్రమైన వర్షాలలో సైతం ఇబ్బందులు ఎదుర్కొంటూ దీక్షలు కొనసాగించారని మురళి గుర్తు చేశారు. 31 కుటుంబాలు శ్రీవారి మెట్టు మార్గాన్ని నమ్ముకుని ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు తోడ్పడుతూ తక్కువ ధరలతో ఆహార పానీయాలను అందిస్తూ టీటీడీకి, భక్తులకు 15 ఏళ్లుగా సేవలు చేస్తున్న వారిని, పులిని సాకుగా చూపి గతంలో వ్యాపారాలు నిలిపివేశారని, పోరాడి సాధించుకున్నప్పటికీ, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ నిలిపివేశారని, ఈ కారణంగా పేదల కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఎదురైందని, వ్యాపారులు టిటిడి ఈఓకు మొరపెట్టుకున్నారు. గత 62 రోజులుగా టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా నిరసన దీక్షలో పాల్గొంటున్న తమ గురించి చర్చించి నిర్ణయం చేయకపోవడం సమంజసం కాదని, తమ కుటుంబాలకు న్యాయం చేయాలని విన్నవించారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, శ్రీవారి మెట్టు వ్యాపారుల సంఘం నేతలు మధు, చిట్టిబాబు, యుగంధర్ పాల్గొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాజకీయ కక్షలతో.. యువకుని హత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్

మృతుడు హరిప్రసాద్ (ఫైల్)

తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని ముత్యాలపాడు గ్రామ పంచాయతీలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన స్వల్ప వివాదం హత్యకు దారితీసింది. ఈ నేపథ్యంలో యువకుడిని దారుణంగా హత్య చేశారు. దీంతో రెండు గ్రామాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసుల వివరాలు మేరకు... ముత్యాలపాడు గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని ఓ మహిళను సోమవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు నారపరెడ్డి వెంకటకష్ణారెడ్డి దూషించారు. అదే సమయంలో అక్కడ ఉన్న టిడిపి నాయకుడు నారపరెడ్డి శ్రీధర్ రెడ్డి వెంకట కష్ణారెడ్డిని మందలించారు. అప్పుడు ఇద్దరు మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. అదే సమయంలో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన గెద్దెల చిరంజీవి, నాగసాల సురేంద్ర మధ్య జరిగిన గొడవను సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. అనంతరం వెంకటకష్ణారెడ్డి వైసీపీ నేతలకు గొడవ సంబంధించిన వివరాలను ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఈ క్రమంలో కట్టరామిరెడ్డి, దిలీప్ కుమార్ రెడ్డి, మరికొందరు వ్యక్తులు రాడ్లు, కర్రలతో అక్కడకు చేరుకొని శ్రీధర్ రెడ్డిని, చిరంజీవి సురేంద్రల పై దాడి చేసి గాయపరిచారు. శ్రీధర్ రెడ్డి మద్దతుదారులైన టిడిపి కార్యకర్తలు మల్లవరపు హరిప్రసాద్, చెలగల కాటయ్య, మరికొందరు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ వైద్య శాలకు తరలించారు. సురేంద్రను అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రి వద్దకు వెళ్లిన కాటయ్య, హరిప్రసాద్ తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఇంట్లో నిద్రిస్తుండగా వైసీపీకి చెందిన వారు వచ్చి ఇంటి కిటికీలు పగలగొట్టి నిద్రపోతున్న కాటయ్య, హరిప్రసాదులపై పెట్రోల్ పోసి నిప్పంటించారని సమాచారం. మంటలు చెలరాగడంతో నిద్రలోంచి తేరుకొని బయటికి వచ్చేందుకు ప్రయత్నించగా వారి ఇద్దరిపై వైసీపీ మూకలు దాడి కి పాల్పడ్డారు. వారిలో కాటయ్య తప్పించుకోగా, మల్లవరపు హరి ప్రసాద్ కింద పడిపోవడంతో తెచ్చుకున్న రాడ్లు, కర్రలతో విచక్షణ రహితంగా కొట్టి చంపేవారు. స్థానికులు వెంటనే స్పందించి హరిప్రసాదను వైద్యం కోసం గూడూరు ప్రాంతీయ వైద్యశాల తరలించారు. అప్పటికే అతను మతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గూడూరు డిఎస్పి వి. రమణ కుమార్ సిఐ. కిషోర్ బాబు, ఎస్.ఐ సురేష్ బాబులు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మతికి గల కారణాలు పై విచారణ చేపడుతున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ చారి నాంచార పేటలో మర్డర్ జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ రెండు వర్గాల ఘర్షణలో రెండు కార్లకు అద్దాలు పగలగొట్టడం జరిగింది .తిరుపతి నుండి క్లూస్ టీం బందం మర్డర్ జరిగిన ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు స్వీకరిస్తున్నారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉంది. పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి రెండు గ్రామాల్లో ఎలాంటి వివాదాలు జరగకుండా పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

హత్యా రాజకీయాలను టీడిపి ప్రోత్సహించదు : ఎంఎల్ఎ

చిల్లకూరు మండలం నాంచారం పేట గ్రామంలో టిడిపి కార్యకర్త హరిప్రసాద్ పై దాడి చేసి హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. చిల్లకూరు మండలం ముత్యాలపాడు పంచాయతీ పరిధిలోని నాంచారం పేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త హరిప్రసాద్ రాజకీయ హత్యకు గురైన సంఘటనను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం తెల్లవారుజామున నాయారంపేట గ్రామంలో దాడికి గురై చికిత్స పొందుతున్న వారిని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎంఎల్ఎ సునీల్కుమార్ పరామర్శించారు. హరిప్రసాద్ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, తిరుపతి రేణిగుంట బైపాస్ రోడ్డు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై ఎన్హెచ్ఎఐ, రెవెన్యూ సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి సారించి పనులు వేగవంతం చేయాలని, నిర్మాణ పనులు నిర్దేశిత గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూ సంబంధిత పెండింగ్ అంశాలపై జెసి శుభం బన్సల్తో కలిసి ఎన్హెచ్ఎఐ పిడిలు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీఓ లు తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు, విఆర్ఓ లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్న కడప -రేణిగుంట, రేణిగుంట - నాయుడుపేట 6 లేన్ వంటి రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుండి రేణిగుంట వరకు) 6 లేన్ల రహదారి వేగవంతం చేయాలని సూచించారు. అలాగే రేణిగుంట నుండి చెన్నై వరకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, భూ సేకరణలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కష్ణపట్నం పోర్ట్ సమీపంలో నాయుడుపేట - తూర్పు కనుపూరు 6 లేన్ల రహదారి 35 కి.మీ, చిల్లకూరు క్రాస్ నుండి తూర్పు కాన్పూర్ వరకు 4 లేన్ల రహదారి, తూర్పు కాన్పూర్ నుండి కష్ణపట్నం పోర్ట్ సౌత్ గేట్ 6 లేన్ల రహదారి 36 కి.మీ, తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్ట్ రోడ్డు పొడిగింపు 6 లేన్ల రహదారి 16 కి.మీ అభివద్ధి పనులు టైం లైన్ మేరకు పూర్తి చేయాలనీ సూచించారు. పారిశ్రామిక రంగానికి జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా మరింత సౌకర్యం కలగనున్నదనీ తెలిపారు. ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎన్ హెచ్ అధికారులు సమన్వయంతో నిర్దేశించుకున్న గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చెన్నై జాతీయ రహదారి 205 కి సంబంధించిన విస్తరణ కొత్త ప్రతిపాదనలకు చెందిన భూసేకరణ చేపట్టాలని, అలాగే రైల్వే ప్రాజెక్టులు శ్రీకాళహస్తి నడికుడి ప్రాజెక్ట్ కు సంబంధించిన భూ సేకరణలో ఇబ్బందులు లేకుండా ఆర్డీఓలు, తాశిల్దార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి -పాకాల రైల్వే ట్రాక్ డబుల్ లైన్ కు సంబంధించిన భూ సేకరణ పనులలో పురోగతి ఉండాలని తెలిపారు. అలాగే తిరుపతి రేణిగుంట బైపాస్, ఐఐటీ, ఐజర్, ఐఐఐటీ శ్రీసిటీ కి సంబంధించిన పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఎన్హెచ్ఎఐ అధికారులు వివరిస్తూ ఎయిర్పోర్ట్ వద్ద పెండింగ్ పనులు నవంబర్ 10 నాటికి, రేణిగుంట నాయుడుపేట వరకు రోడ్ నవంబర్ చివరి నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పీలేరు కాలూరు రహదారి నిర్మాణం 15 జనవరి2025 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జెసి భూసేకరణ పెండింగ్ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పిడి ఎన్హెచ్ఎఐ లు తిరుపతి వెంకటేష్, నెల్లూరు ఎం.కే. చౌదరి, చెన్నై రవీంద్ర రావు, జిల్లా సర్వేయర్ అరుణ్, డిటి భాస్కర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

హైవే రోడ్డు విస్తరణలో రైతులకు న్యాయం చేయాలి : నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులందరికీ పార్టీలకతీతంగా న్యాయం చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి విన్నవించారు. 1956 జాతీయ రహదారుల చట్టం 3 జి (4) గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం కుక్కలపల్లి నుంచి మల్లవరం వరకు 140 జాతీయ రహదారిలో చెక్ డ్యాంలు, కాలువల నిర్మాణం కోసం అవసరమయ్యే భూసేకరణ విషయమై రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పలుదఫాలు కోరిన మేరకు చిత్తూరు జెసి మంగళవారం చంద్రగిరి తాశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించి భూ వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో భూములు కోల్పోయిన రైతులకు సరియైన న్యాయం జరగకపోవడంతో పలువురు పరిహారాన్ని తీసుకోకుండా కోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఇండ్లు కోల్పోయిన వారికి ఇంటి స్థలాలు సక్రమంగా పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనపాకం వద్ద ఫ్లై ఓవర్ సమీపంలో 80 మంది రైతులకు మూడు సెంట్ల ఇంటి స్థలాలను మంజూరు చేయాల్సి ఉన్నా వారికి న్యాయం జరగలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి తహశీల్దార్ రాం సుబ్బయ్య పాల్గొన్నారు.

తిరుపతి, చిత్తూరు జిల్లాలో సిఐడి తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో సిఐడి బందం మద్యం డిస్టలరీల్లో మంగళవారం సోదాలు జరగడంతో జిల్లా వ్యాప్తంగా కలకలం రేగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా సిఐడి బందం పలు డిస్టలరీల్లో తనిఖీ చేసి ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి తో పాటు చిత్తూరు జిల్లాలోని పలు డిస్టలరీల్లో తనిఖీలు చేశారు. ఎన్నికల సమయంలో వివిధ డిస్టలరీల్లో ఉత్పత్తి చేసిన మద్యం లెక్కలపై సీఐడీ బందాలు ఆరా తీస్తోంది. డిస్టలరీల నుంచి నేరుగా నేతలకు మద్యం సరఫరా చేశారనే కోణంలో పరిశీలిస్తున్నారు. డిస్టలరీల యాజమాన్యం వెనుక బినామీలు ఉన్నారనే కోణంలో విచారణ జరుగుతోంది. 2014 - 2019 మధ్య కాలంలో టీడీపీ అనుమతులు ఇచ్చిన డిస్టలరీలను పలువురు వైసీపీ నేతలు చేజిక్కించున్నారనే ఫిర్యాదులపై విచారణ జరుగుతోంది. డిస్టలరీల నుంచి బెవరేజ్ కార్పొరేషన్కు మాత్రమే కాకుండా అనధికార సరఫరాపై సీఐడీ ఫోకస్ పెట్టింది. రికార్డుల పరిశీలన, ఆధారాల సేకరణపై సీఐడీ దష్టిసారించినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా లిక్కర్ డిస్టలరీలలో సీఐడీ తనిఖీలు చేపట్టింది. 2019- 24 మధ్య తయారైన లిక్కర్ నాణ్యత పై ప్రభుత్వం దష్టి సారించింది. రెండు నెలల క్రితం ఎక్సైజ్- సీఐడీతో జాయింట్ కమిటీలను ఏర్పాటు చేసింది. వివిధ డిస్టలరీలల్లో తయారైన మద్యం శాంపిల్స్ ను ఈ టీంలు సేకరించాయి. వీటికి సంబంధించిన కెమికల్ ఎనాలసిస్ రిపోర్టులు ప్రభుత్వానికి చేరినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రికార్డుల తనిఖీలు కీలకంగా మారాయి. డిస్టలరీలలో తయారయ్యే బ్రాండ్లు వైసీపీ ముఖ్య నేత కంపెనీకి చెందినవిగా టీడీపీ ఆరోపించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై ప్రభుత్వం దష్టి సారించింది. సోదాలకు గల కారణాలను సీఐడీ కానీ ఎక్సైజ్ శాఖ కానీ నిర్ధారించడం లేదు. చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీ డీకే పల్లి సమీపంలోని వ్యాంటేజీ డిస్లరీలో సీఐడీ అధికారులు తనిఖీలు జరిపారు.. గత ఐదు సంవత్సరాలలో ఎంతతయారు చేశారు.. ఎంత ప్రభుత్వానికి సరఫరా చేశారు, అన్నరికార్డులను సీఐడీ అధికారులు పరిశీలించారు. ప్రయివేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలోనూ సీఐడీ అధికారులు సోదాలు జరిపారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే ప్రశంస

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జిల్లా స్థాయి అండర్-14 బాలికల బ్యాడ్మింటన్ విభాగంలో విజేతగా నిలిచిన ఎంజీఎం విద్యార్థిని షేక్ సనా ఫిర్దోస్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మంగళవారం ప్రశంసించారు. ఈ నెల 28వ తేదీన మల్కిపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించి శ్రీకాళహస్తికి పేరు తీసుకురావాలని, కావలసిన సహకారాలను అందిస్తామన్నారు.

డీటీఎన్ పార్టనర్గా తిరుపతి ఐఐటి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

డ్రోన్ టెక్నాలజీకి నాలెడ్జ్ పార్టనర్గా ఐఐటీ తిరుపతితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం తిరుపతి ఐఐటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. తిరుపతి ఐఐటి ఇంటిగ్రేషన్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, స్టార్టప్ సపోర్ట్, ఎంటర్ప్రెన్యూర్షిప్ను ప్రోత్సహించడం వంటి కీలక రంగాలలో సాంకేతిక అభివృద్ధి సాధించింది. ఏరియల్ బేస్ స్టేషన్ ను ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సర్వేంద్ర నాథ్ అభివద్ధి చేశారు. ఐఐటి తిరుపతికి ఈ గుర్తింపు లభించింది. ప్రొఫెసర్లు శ్రీనివాస్తవ్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

'కార్తీక్ మ్యూజిక్ కాన్సర్ట్'కు అనుమతి వద్దు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్



ఈనెల 26న శనివారం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తారకరామ స్టేడియంలో సినీ గాయకుడు కార్తీక్ ఆధ్వర్యంలో జరిగే మ్యూజిక్ కాన్సర్ట్కు యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దుచేసి, యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం కలగకుండా కాపాడాలని యూనివర్సిటీ ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అక్బర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు జరిగే ప్రాంతాలలో అసభ్యకరమైన పాటలు పాడుతూ మహిళలను కించపరిచేలా ఉంటాయని, కార్యక్రమానికి వచ్చే వ్యక్తులు తమ వాహనాల పార్కింగ్ కోసం యూనివర్సిటీలోకి రావడం వలన విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆరోపించారు. తిరుపతి నగరంలోని వేలాది మంది ప్రజలు రావడం వలన తొక్కిసలాట జరిగి, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమానికి కొంతమంది యువత మద్యం, గంజాయి, హుక్కా వంటి మత్తు పదార్థాలను సేవించి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చెయ్యకపోతే నేరుగా స్టేడియానికి విద్యార్థులతో కలిసి వెళ్లి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమస్యను జిల్లా కలెక్టరుకు, ఎస్పికి తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అశోక్, వినోద్, నరేంద్ర వీరేష్ పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్కు సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన రవి నాయుడును మంగళవారం మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, ఉపాధ్యాయులు కష్ణమ నాయుడు, జగన్నాధ రావు, శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు క్రీడల పట్ల చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. త్వరలో పాఠశాలలో జరగబోయే రాష్ట్రస్థాయి బేస్ బాల్ అండర్ 14 పోటీలకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తారని శాప్ చైర్మన్ చెప్పారని ఉపాధ్యాయులు తెలిపారు.

అన్నప్రసాద కేంద్రంలో అదనపు ఈవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలోని మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భోజనం రుచి, నాణ్యత గురించి భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యత చాలా బాగుందని భక్తులు అదనపు ఈవో వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీ రాజేంద్ర, స్పెషల్ క్యాటరింగ్ అధికారి శ్రీ శాస్త్రి పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలించిన జెఇఒ

తిరుపతిలోని అలిపిరి జూపార్క్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను టిటిడి జేఈవో గౌతమి మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. టిటిడి ప్రతిష్టాత్మకంగా శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆరు అంతస్తులతో 50 వేల ఎస్ఎఫ్టీ విస్తీర్ణంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 2025 మార్చి నాటికి పనులు పూర్తి చేసేందుకు అదనంగా కార్మికులను ఏర్పాటు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జేఈవో వెంట స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్ వి కుమార్, సిఇ సత్యనారాయణ, శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ డా.శ్రీనాథ్ రెడ్డి, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, ఈఈలు కష్ణారెడ్డి, మల్లికార్జున ప్రసాద్ ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే!

- 'పల్లె పండుగ'లోనైనా పరిష్కారం అయ్యేనా?
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని కోటమంగాపురం కొత్తయాదవాపురం, పాతపాళెం పంచాయతీ అరుంధతి వాడలో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. వీధులన్ని బురదమయంగా మారుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగలోనైనా తమ గ్రామానికి సిసి రోడ్డు ఏర్పాటు చేస్తారని స్థానికులు ఎదురుచూస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. కెవిబిపురం మండలంలోని కోటమంగాపురం పంచాయతీ కొత్త యాదవాపురంలో సుమారు పదుల సంఖ్యలో కుటుంబాలు నివసిస్తున్నాయి. పాతపాలెం పంచాయతీలోని అరుంధతి వాడలో సుమారు 25 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ రెండు గ్రామాలకు వెళ్లే దారి సమస్యలకు నిలయంగా మారింది. గతంలో అరుంధతి వాడకు సీసీ రోడ్డు మంజూరైంది. అప్పటి కాంట్రాక్టరు సుమారు ఒక కిలోమీటరు దూరం ఉన్న సిసి రోడ్లు అటువైపు, ఇటువైపు వేసి మధ్యలో సగభాగం వదిలేశారు. రైతులు పొలం పనులు చేసుకునేందుకు ఈ రోడ్డు ద్వారానే వెళ్లాల్సి వుంది. చినుకు పడితే మట్టి రోడ్డు చిత్తడి చిత్తడిగా మారి వాహన దారులు గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. మట్టిరోడ్డు గుంతల్లో పడి పలువురు గాయాల పాలవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, కూలి పనులకు వెళ్లే కార్మికులు, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పాతపాలెం పంచాయతీలోని బీసీ కాలనీ, హరిజన వాడ, గ్రామంలోనూ మురికి కాలువలు పూర్తిగా లేవు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో ఈ నీటిని తాగుతున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఇటీవల విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని బల్బులు వెలగడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. 'పల్లె పండగ, వారోత్సవాలలోనైనా గ్రామంలో సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడడంతో బురదమయమైన రోడ్డు

క్రైం న్యూస్

ఎర్రచందనం పట్టివేత

వాహనం స్వాధీనం

కారుతో సహా ఎర్రచందనం దుంగలను పట్టుకున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: వందంద సమాచారంతో ఎర్రచందనం దుంగలతో పాటూ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని అటవీ శాఖాధికారులు తెలిపారు. వారి కథనం మేరకు.. భాకరాపేట అటవీ శాఖ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు నెరబైలు పంచాయతీ పులిగోనపల్లి పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం రెండు గంటల ప్రాంతంలో ఎర్రచందనాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న కారు అతి వేగంగా వెళ్లిందని, అటవీ శాఖాధికారులు కారును వెంబడించారని తెలిపారు. కమళ్ళ, తెట్టుపల్లి, చెట్టేవారిపాలెం పరిసర ప్రాంతాల్లో పీలేరు, తిరుపతి జాతీయ రహదారి పక్కనే వున్న కమ్మపల్లి వద్ద తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో స్మగ్లర్లు అటవీ శాఖ అధికారులను చూసి చీకట్లో పొదల్లోకి పారిపోయి తప్పించుకున్నారన్నారు. కారును పరిశీలించగా ఆరు ఎర్రచందనం కొయ్యలు పట్టుబడ్డాయని తెలిపారు. పట్టుబడ్డ ఎర్రచందనం కొయ్యలు బరువు 181 కేజీలు ఉండగా వీటి విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం ముమ్మురంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ, వి ప్రదీప్ కుమార్, ఎఫ్‌బిఓ లు, ప్రదీప్ చాంద్, రాజేష్ కుమార్, నిఖిల్, డ్రైవర్ శంకర్, శ్రీనివాసులు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

వినుత దంపతులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత, చంద్రబాబు దంపతులపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేణిగుంట అర్బన్ పీఎస్‌లో నమోదైన ఓ అక్రమ కేసును కొట్టి వేస్తూ జిల్లా జడ్జి మంగళవారం తీర్పునిచ్చారు. తమపై గత ప్రభుత్వ హయాంలో 17 కేసులు నమోదయ్యాయని, అందులో ఒక కేసును కొట్టివేస్తూ జిల్లా జడ్జి తీర్పు ఇవ్వడం న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్యంపై నమ్మకం పెరిగిందని వినుత దంపతులు అన్నారు.

సైకిల్‌ను ఢీకొన్న కారు

కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్ : మద్యం మత్తులో కారు డ్రైవరు సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఏర్పేడు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏర్పేడు మండలం సదాశివపురం గ్రామానికి చెందిన ముని రామిరెడ్డి అలియాస్ జగ్గారెడ్డి డిక్సన్ కంపెనీలో రోజువారి కూలీ పనికి వెళ్లేవాడు. మంగళవారం ఉదయం పనికి వెళుతుండగా మూల కండ్రిగ ఓ సూరమ్మ గుడికి కారులో వస్తున్న ఒక వ్యక్తి అతిగా మద్యం సేవించి ఎండి పుత్తూరు క్రాస్ వద్ద ఒక్కసారిగా అతి వేగంతో సైకిల్‌పై వెళుతున్న ముని రామిరెడ్డిని కారుతో ఢీకొనడంతో పక్కనే ఉన్న పొదల్లో మునిరామిరెడ్డి పడిపోయాడు. కాలు విరిగి, తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఏర్పేడు పోలీసులకు సమాచారం అందడంతో ఏర్పేడు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే విజయశ్రీ జన్మదినం



ఎమ్మెల్యే విజయశ్రీకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ జన్మదిన వేడుకలు నాయుడుపేట లోని టిడిపి సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం మాజీ ఏఎంసీ ఛైర్మన్ శిరసనం భేటీ విజయ భాస్కర్ రెడ్డి, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, టిడిపి నాయకులు గూడూరు సుధీర్ రెడ్డి, అవదానం సుధీర్, కట్టా వెంకటరమణారెడ్డి, జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉయ్యాల ప్రవీణ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, టిడిపి నాయకులు పసల గంగాప్రసాద్, పలువురు నాయకులు ఎమ్మెల్యేకి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి జన్మదినం

మాజీ ఎఎంసి ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న టిడిపి నాయకురాళ్లు

నాయుడుపేట: టిడిపి సీనియర్ నాయకులు, నాయుడుపేట మాజీ ఏఎంసి ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు నాయుడు పేటలోని ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం టిడిపి నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉయ్యాల ప్రవీణ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, అరవ పిరమిడి మాజీ సర్పంచ్ సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి నాయకులు పసల గంగా ప్రసాద్, షేక్ కరిముల్లా, పలుకూరు ముత్యాలయ్య, కాపులూరు చక్రపాణి, నానబాల సుబ్బారావు, పి చెంగయ్య, టిడిపి మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ భాస్కర్ రెడ్డికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'రీ సర్వే సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రీ సర్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రసాద్ పేర్కొన్నా రు. గూడూరు మండల పరిధి లోని కొమ్మనేటూరు గ్రామం లో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రీ సర్వేలో విస్తీర్ణం తేడాలు, పేరు కరెక్షన్స్ , హద్దులు వంటి సమస్యలపై అర్జీలను గ్రామస్థుల నుండి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ సుబ్బారాయుడు, మండల సర్వేయర్ విశ్వనాథం , గ్రామ సర్వేయర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

భీష్మయ్య నాయుడుకి పలువురు నివాళి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, నారావారిపల్లి రోడ్డు, శేషాపురానికి చెందిన టిటిడి రిటైర్డ్ హెల్త్ ఆఫీసర్ బొబ్బా భీష్మయ్య నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. మృతి విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి మండల నాయకులతో కలిసి భీష్మయ్య నాయుడు స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యుల పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వి సుబ్రహ్మణ్యం నాయుడు, ధనంజయరెడ్డిలు పాల్గొన్నారు.

ఎన్‌బికేఆర్ఐఎస్‌టి అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి -కోట : కోట మండలం విద్యానగర్ లోని స్థానిక ఎన్‌బికేఆర్ ఐఎస్‌టిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కందాటి దశరథ రామిరెడ్డికి అనాలసిస్ ఆఫ్ ఫెడరేటెడ్ లెర్నింగ్ అనే అంశంపై డాక్టర్ ఎం ప్రవీణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి విజయ్ కుమార్ రెడ్డి కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ రాజశేఖర్ రెడ్డి అభినందించారు.

ఉచిత మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రూ.56 లక్షల వ్యయంతో నిర్మించిన ఉచిత మరుగుదొడ్లను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభించారు. తిరుమల గోపురం, టూరిస్ట్ బస్టాండ్ వద్ద నిర్మించిన ఈ ఉచిత మరుగుదొడ్లు సుదూరం నుంచి వచ్చే భక్తులకు ఎంతో అనుకూలంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ ఈఈ మురళీధర్, ఏఈఓ లోకేష్ రెడ్డి సూపరింటెండెంట్ అండ్ సిఎస్ఓ నాగభూషణం యాదవ్, ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ కిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, టిడిపి నేత రంగినేని చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.

స్కూలు లీడర్షిప్ పై మాస్టర్ క్లాస్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దేశంలోని ప్రముఖ స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ గ్రూప్ భారతదేశంలోని అతిపెద్ద పాఠశాల అవార్డుల కార్యక్రమాలలో ఒకటైన శిక్షా అవార్డులను విజయవంతంగా అందించింది. ఈ సందర్భంగా స్కూల్ లీడర్షిప్ పై మాస్టర్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమము ఉద్దేశించి లీడ్ గ్రూప్ సీఈఓ సుమీత్ మెహతా మాట్లాడుతూ వరుసగా రెండవ సంవత్సరం, లీడ్ గ్రూప్ అందించిన శిక్ష అవార్డులు, దేశంలోని విద్యార్థుల అభ్యాసాన్ని మారుస్తున్న విద్యా నైపుణ్యం పట్ల, అచంచలమైన అంకితభావాన్ని కలిగి ఉన్న అసాధారణమైన పాఠశాలలు, పాఠశాల నాయకులను గుర్తించి వేడుక నిర్వహించామన్నారు. విద్యార్థుల నేతత్వంలోని సమావేశాలతో సహా పలు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల విద్యలో తల్లిదండ్రుల ప్రమేయాన్ని మెరుగుపరుస్తున్నారని వెల్లడించారు. 2023 శిక్షా అవార్డులలో 2200 కంటే ఎక్కువ పాఠశాలలు, 29000 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ 2023 శిక్షా అవార్డుల విజేతలలో తిరుపతిలోని శ్రీ కాకతీయ పబ్లిక్ స్కూల్, శ్రీ కాకతీయ హైస్కూల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి. శోభా రెడ్డి, తిరుపతిలోని శ్రీ విశ్వం పబ్లిక్ స్కూల్ ఓనర్ రెడ్డి జయచంద్ర కూడా ఉన్నారని, ఇతర విజేతలలో విజయవాడ, కడప, కాకినాడ, విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరులోని లీడ్ భాగస్వా మ్య పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.

రాస్ ఆధ్వర్యంలో మెగా పశువైద్యశిబిరం

ప్రజాశక్తి -రేణిగుంట: రాస్ ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్రీయ సేవాసమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ . వెంకటరత్నం ఆదేశానుసారం, పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు సూచన- సలహాల మేరకు, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో పశువులకు, జీవాలకు రాస్ కె. వి.కె. వెటర్నరీ డాక్టర్ అనూష వారి బందం ద్వారా ఈ కార్యక్రమం జరిగింది. పశువులకు వైద్యపరీక్షలు చేసి, వర్షాకాలం, శీతాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉచిత మందులు అందజేశారు. ప్రతి పశువుకి ,జీవానికి కడుపులో ఉన్న పురుగులకు సంబంధించి పురుగుల మందు తాగించడం , పిడుదులకు సంబంధించి మందును స్ప్రే చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిప్రసాద్, అన్బలగన్, శంకరయ్య, నాగమణి, ఇందుమతి, జ్యోతి, స్వాతి, ట్రస్టీ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

'అవగాహనతో వ్యవసాయాభివృద్ధి'

ప్రజాశక్తి -కోట : అవగాహనతోనే రైతులకు వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని వ్యవసాయ అధికారి వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోట మండలంలోని పుచ్చలపల్లి, అల్లంపాడు గ్రామాల్లో ఆధునిక పంటలపై దృష్టి సారించేలా వరి సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిలో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ, మత్స్యశాఖల అధికారులు పొలంబాట పట్టే దిశగా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ సందర్భంగా చర్యలు చేపట్టడంతో పాటుగా సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన దిగుబడులపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సాగుల్లో నాలుగు నెలల వంతున 'పొలం పిలుస్తోంది' నిర్వహించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారన్నారు. అధికారులు రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలనతో పాటు లోపాలు గుర్తిస్తారని ఈ వివరాలు రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసు కోవడం, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం పథకం దిశగా ప్రోత్సహించడం చేస్తారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాలు మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించనున్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా మార్చాలి

జై భీమ్ సేన డిమాండ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి లేదా చిత్తూరు జిల్లాను శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా మార్చాలని జై భీమ్ సేన నాయకులు మంగళవారం డిమాండు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా, వైఎస్ఆర్ జిల్లాలను, తాము పోరాడి అంబేద్కర్ జిల్లాగా కోనసీమ జిల్లాగా మార్చా రన్నారు. ప్రకాశం పంతులు జిల్లా, అన్నమయ్య జిల్లా ఉన్నప్పుడు శ్రీకృష్ణదేవరాయ జిల్లాగా ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. ఇలా మనమెందుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయలేదని, మహాత్మ జ్యోతిరావు పూలే, శ్రీకృష్ణదేవరాయ జిల్లాలుగా ప్రకటించాలని జై భీమ్ సేన తరపున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాను కచ్చితంగా శ్రీకృష్ణదేవరాయ జిల్లాగా ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని జై భీమ్ సేన నాయకులు కార్యకర్తలు డిమాండ్ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న జైభీమ్ నాయకులు

రోడ్డు సమస్యను పరిష్కరించండి..!

- కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: తమ గ్రామానికి వెళ్లేందుకు నెలకొన్న రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఏర్పేడు మండలం చెందేపల్లి గ్రామస్తులు మంగళవారం వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు మాట్లాడుతూ ఏర్పేడు మండలంలోని నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారి నుండి చిందేపల్లికి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డును గత ప్రభుత్వ హయాంలో ఈసీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వ అధికారులు, నాయకులతో కుమ్మక్కై భారీ పోలీసు బలగాలతో ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి, భయభ్రాంతులకు గురి చేసి వారి రోడ్డును దౌర్జన్యంగా లాక్కున్నారని ఈ ఆర్అండ్‌బి రోడ్డుకు బదులుగా ఫ్యాక్టరీకి వెలుపల మళ్లీ కాలువను ఆక్రమించి నామమాత్రంగా ఎలాంటి సేఫ్టీ లేకుండా రోడ్డును ప్రత్యామ్నాయంగా చూపా రని, ఆ రోడ్డునూ దౌర్జన్యంగా లాక్కోవాలనే ఉద్దేశంతో ఈసీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం హెచ్ఆర్ జనరల్ మేనేజర్ దొరై రాజు, డీఎస్పీగా రిటైరై పీఆర్వోగా పని చేస్తున్న అభిషేక్ వంటి వారి ఆలోచనలతో కొంత మంది అధికారులతో కుమ్మక్కై సన్నాహా లు చేస్తున్నారని, చిందేపల్లికి వెళ్లే మార్గంలో ప్రత్యేక గేటును ఏర్పాటు చేసి అటు వెళ్లే వారి వివరాలను సేకరిస్తున్నారని, గ్రామస్తులను భయభ్రాంతులను చేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రోడ్డును వెంటనే తమకు ఇప్పించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించా మని తెలిపారు.

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

భూ సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

- ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, పుత్తూరు మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్టులో భాగంగా రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం పుత్తూరు తహశీల్దారు జీసీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పుత్తూరు మండలం గొల్లపల్లి సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో గంజి మాధవయ్య మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో రైతులను గందరగోళానికి గురిచేసిందని ఎలాంటి రీసర్వే చేయనప్పటికీ చేసినట్లు భూరికార్డులను మార్చారని తెలిపారు. ఇప్పుడు నిర్వహిస్తున్న గ్రామసభలలో రైతుల నుంచి సరైన అర్జీలు, వివరాలు సేకరించి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఐవోఎస్ కృపాకర్, మండల సర్వేయర్ శేషమ రాజు, మాజీ ఎంపీటీసీ కోట గజపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంజి మాధవయ్య

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అలవర్చుకోవాలి: మాజీ ఎంపిపి

ప్రజాశక్తి- రామచంద్రాపురం: రైతుల ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుని పంట సాగు చేస్తే అధిక దిగుబడిని సాధించవచ్చని మాజీ ఎంపీపీ బిందు మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని అనుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ అధికారులు 'పొలం పిలుస్తోంది'ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమ ధ్యేయంగా టిడిపి పనిచేస్తోందని, రైతులు రాయితీ పరికరాలు డ్రిప్ ఇరిగేషన్, ఎరువులు, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి రైతుల కోసం గోకులం పథకం కింద గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని వాటిని సకాలంలో నిర్మాణం చేపట్టాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది'ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం బాదురు పశువైద్యాధికారి హేమ కుమార్, ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్ రంగయ్య, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్న దృశ్యం

ఘనంగా టిఎంఆర్ విద్యాసంస్థల అధినేత జన్మదినం

తంబిరెడ్డి మనోహర్ రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-చిట్టమూరు: టిఎంఆర్ విద్యా సంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను చిట్టమూరు మండలం కొత్తగుంటలోని టిఎంఆర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయు లు, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. భారీ కేకు కట్ చేసి విద్యార్థులకు కేకు, మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మనోహర్ రెడ్డికి ఉపాధ్యాయులు, స్థానికులతో పాటు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మనోహర్ రెడ్డిని శాలువాలు, పూలమాలలు, గజ మాలలతో సన్మానించి, సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిప ల్ రహంతుల్లా, మేనేజర్ ఆశా శ్రీనివాసులు, స్థానిక ఉపాధ్యా యులు, పలువురు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్త హీనత దూరం..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు రక్తహీనత సమస్యను ఎదు ర్కొం టున్నారని పౌష్టి కాహారంతో రక్తహీనత సమస్యను దూరం చేసు కోవచ్చుని కళాశాల ప్రిన్సిపా ల్ డాక్టరు కోటేశ్వరయ్య అన్నారు. డిగ్రీలలో నూతనంగా చేరిన విద్యార్థినివిద్యార్థులకు కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధవ్యంలో మంగళవారం రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల రక్త గ్రూపుల వివరాలు, రక్త హీనత తదితర వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ రక్త గ్రూపునకు సంబంధించిన వివరాలు తెలుసుకుంటే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుందని తెలిపారు. వృక్షశాస్త్ర అధ్యాపకులు ఈ కార్యక్రమంలో డాక్టరు ఎస్ పద్మావతి, మైక్రోబయాలజీ అధ్యాపకులు జయప్రద, విద్యా ర్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.NO. 27 / 2024

దుద్దా శ్రీనివాసులు రెడ్డి, S/o లేట్ బాలక్రిష్ణారెడ్డి, హిందూ, వయస్సు 54 సంవత్సరాలు, R/o తిప్పరపాడు గ్రామం, గూడూరు మండలం, తిరుపతి జిల్లా. ....పిటిషనర్

Vs

1. ఇరువూరు శేషారెడ్డి, S/o రామిరెడ్డి, హిందూ, వయస్సు 50 సంవత్సరాలు
2. కొండూరు కామక్షమ్మ, W/o వినయ్ వర్ధన్ రెడ్డి, హిందూ, వయస్సు 40 సంవత్సరాలు

R/o తిప్పవరపాడు గ్రామం, గూడూరు మండలం, తిరుపతి జిల్లా. .....రెస్పాండెంట్

జనరల్ నోటీసు

ఇందుమూలంగా యావన్మంది తెలియజేయడం ఏమనగా పై పిటిషనర్ 1వ రెస్పాండెంట్‌ని ఇన్‌సాల్‌వెంట్‌గా డిక్లేర్ చేసి ఆయన 2వ రెస్పాండెంట్ పేరిటికి 6-7-2024 తేదినా వ్రాసి ఇచ్చినా రిజిష్టర విక్రయ దస్తావేజ్‌నూ రద్దూ చేయమని కోరుతూ పై I.P ని దాఖలు చేసి వున్నారు.

సదరు I.P 4-11-2024 తేదికి పై కోర్టు వారు వాయిదా వేసి వున్నారు. కావున ఎవరికైనా అభ్యంతరం ఉన్న యెడల ఆ రోజున ఉదయం 10.30 నిమిషములకూ పై కోర్టు వారికి తెలుపవలసింది.

ఈ ప్రకటన పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రకటించబడింది.

ఇట్లు,

కందనూరు వెంకటకిష్ణయ్య, బి.ఎ., బి.ఎల్., అడ్వకేట్, గూడూరు.

సెల్ : 9440113977

CHANGE OF NAME

I, RUDRAKOTA PARVATHI, D/o RUDRAKOTA SRIRAMULU (Before Marriage) resident of KOTA Village & Mandal, Tirupathi, District.A.P.hereby declare that I have changed my name as

KOTA NIRMALA

W/o **KOTA PULLAIAH**

(After Marriage)

vide A.P. Gazette Notification Part II Extraordinary No.576, G.469 dt.11-09-2024

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేరుస్తూ మంగళం ప్రాంతాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. మంగళవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ కోళ్ల ఫారాలలో ఉన్న జననివాస ప్రాంతాలలో ఉపాధి హామీ నిధులతో సిసి డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా తిరుపతి రూరల్ మండలానికి కేటాయించిన 391.60(లక్షలలో)ఉపాధి హామీ నిధులలో దాదాపు 60 శాతం నిధులు మంగళం అభివృద్ధికి కేటాయించామన్నారు. ఒక్క తిరుమల నగర్ గ్రామ పంచాయతీ జయశంకర్ కాలనీ, చెంచులక్ష్మి యానాది కాలనీకి 11.30(లక్షలు), కె.బి.ఆర్ నగర్ 11.10(లక్షలు), తుడా క్వార్టర్స్ 12 లక్షలు, కోళ్ల ఫారాలలో 22 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. స్థానిక ప్రజలు ఇంటి పట్టాలను ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామ కమిటీ హాలును మంజూరు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. త్వరలో హామీలే కాకుండా, ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, తిరుపతి రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, పుదీపట్ల, తిరుమల నగర్ గ్రామపంచాయతీల సర్పంచులు బడి సుధా యాదవ్, వకుల, టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ మధు, అర్బన్ తహశీల్దారు భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీ ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షులు ఈశ్వరయ్య, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి చెన్న రాయప్ప, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని కానూరు రాజుపాలెంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శశిధర ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వనరుల శాఖ వారు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట ఉద్యానవన శాఖ అధికారిణి శారద మాట్లాడు తూ ప్రతి రైతు అవకాశం ఉన్నంతవరకు భూసార పరీక్షలు చేయించు కోవాలని తద్వారా వ్యవసాయ మెలకువలు, దిగుబడులు ఎక్కువ వచ్చే ఎలాంటి సీజనల్ పంటలు వేయాలో రైతులకి సంపూర్ణ అవగాహన వస్తుందన్నారు, నిమ్మ సాగులో యాజమాన్య పద్ధతులు, నిమ్మలో కలుపు నివారణ, చీడపురుగుల నియంత్రణ, తెగుళ్ల నివారణ వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు విఏఏ శ్రీరాములు రైతులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త హత్య దారుణం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్: చిల్లకూరు మండలం నాంచారంపేటలో టీడీపీ కార్యకర్త హరి ప్రసాద్ (20) ను హత్య చేయడం దారుణం అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం గూడూరు పట్టణంలోని టిడిపి కార్యా లయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ దళిత యువకుడు హరిప్రసాద్‌పై వైసీపీ మూకలు దాడి చేసి హత్య చేయడం దారుణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల వ్యవస్థను నాశనం చేశాడన్నారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్ లో జగన్మోహన్ రెడ్డి అరాచక ఆంధ్రప్రదేశ్ లాగా మార్చారని పేర్కొన్నారు. మృతిని కుటుంబానికి పార్టీ అన్ని విధాలా ఆదుకుం టుందన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ హత్యా రాజకీయలను టిడిపి ప్రోత్సహిం చదన్నారు. టిడిపి కార్యకర్త హత్య బాధాకరం అన్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లా డుతూ ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో రాజకీయ హత్య జరగడం బాధాకర మన్నారు. మృతుడు కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గూడూరు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీ గదిలో ఉన్న కార్యకర్త మృత దేహానికి ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, రామకృష్ణ, నెలవల విజయశ్రీలు కలిసి నివాళులు అర్పించారు. వీరి వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

హరిప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్నఎమ్మెల్యేలు